క్లుప్తంగా

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలవరం ఎక్సైజ్ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ అధికారులు సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించారు. ఎక్సైస్ సీఐ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఎల్ఎన్డీపేట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో బెల్లపు ఊట డంప్‌ను గుర్తించామన్నారు. డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 2,600 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, పోలవరం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కామవరపుకోట: స్థానిక ఈ ఎంఈఓ కార్యాలయ ఆవరణలో సోమవారం పీఆర్టీయూ నూతన క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారులు డి. సుబ్బారావు, చిన్నం ప్రశాంత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమష్టితో పనిచేసి మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ సభ్యులు శర్మ, ఎస్ఆర్‌కే ప్రసాద్, సుందర్, భానుప్రకాశ్, జి.నాగేంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



గవరవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో దీపాలంకరణలో మహిళలు

కొయ్యలగూడెం: శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో మహిళా భక్తులు దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించి 93 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సోమవారం దీపాలంకరణ కార్యక్రమం చేపట్టారు. దేవేరితో సహా స్వామివారికి ఊంజల్ సేవ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 5న స్వామి వారికి నిర్వహించిన లక్షతులసి దళార్చనలో భాగంగా దళాలను భక్తులకు పంచారు.

భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తాం



మర్లగూడెంలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

బుట్టాయగూడెం: భూ సమస్యలపై వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు. మండలంలోని మర్లగూడెంలో సోమవారం రెవెన్యూ సదస్సు సర్పంచ్ తాతి సీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జైనవారిగూడెం, మర్లగూడెంకు చెందిన సమస్యలపై వినతిపత్రాలను తహసీల్దార్, సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా భూములకు సంబంధించిన దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి

భీమడోలు: భీమడోలు రైల్వేస్టేషన్ నుంచి సంతమార్కెట్ వరకు గల రోడ్డుకు ఇరువైపులా అక్రమణలు తొలగించాలని గ్రామ పెద్దలు సోమవారం తహసీల్దార్ బి.రమాదేవికి ఫిర్యాదు అందజేశారు. భీమడోలులో సోమ వారం నిర్వహించిన మీకోసంలో వారంతా కలిసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసారు. వచ్చే నెల 7 నుంచి మార్చి 9వ తేదీ వరకు భీమడోలులో జాతర జరుగుతుందని, దీనితో గ్రామంలో రద్దీ వాతావరణం నెలకొంటుందన్నారు. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి బస్ సౌకర్యం కల్పించాలని పెద్దలు ఆదిరెడ్డి సత్యనారాయణ, పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, దాసరి వీరాస్వామి తదితరులు మీకోసంలో ఫిర్యాదు చేసారు.

పారిశుద్ధ్యం..అధ్వానం

- కామవరపుకోటలో వీధుల్లో పేరుకుపోయిన చెత్త
- పూడుకుపోయిన డ్రెయినేజీలు
- ప్రవహించని మురుగునీరు
- దోమల దాడి, దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు

కామవరపుకోట: గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధులు చెత్తాచెదారంతో, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ముఖ్యంగా కామవరపుకోటలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలో చాలాచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక అవి పూడిపోయి మురుగునీరు నిలవ ఉండి, దుర్వాసన చెందుతున్నాయి. ఈ రోడ్ల వెంబడి వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల నివాసాల వారు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు.

● జాగుడుగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అనుకుని, నివాసాల మధ్య చెత్తా చెదారంతో దుర్వాసన చెందుతోంది. పంచాయతీ అధికారులు పట్టించుకోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది వారికి గుర్తు వచ్చినప్పుడు వస్తున్నారని చాలా కాలం నుంచి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. స్థానిక గ్రంథాలయం ఎదురు వీధిలోని డ్రెయినేజీ మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు విపరీతంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. అదే వీధిలో బీసీ హాస్టల్ ఉంది, దానిని ఆనుకుని చెత్తాచెదారం, మిగిలిన ఆహార పదార్థాలు స్థానికులు అక్కడ వేయటంతో దుర్గంధం వ్యాపిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పది రోజులైనా పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి చెత్త తీయడం లేదని విద్యార్థులు, స్థానికులు తెలిపారు. బయో మెడికల్ వేస్ట్ ఎక్కడిపడితే అక్కడ వేస్తున్నారు. మామూలు చెత్తతో పోల్చితే ఇది చాలా ప్రమాదకరం. ఈ బయో మెడికల్ వేస్టేజీని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డులో కుప్పగా పోశారు. వర్షం కురిస్తే లీకైన మంచినీరు పైపులు ద్వారా మెడికల్ బయోవేస్ట్ కలుషితమైతే ప్రజా ఆరోగ్యానికి ముప్పని పలువురు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో అన్ని శాఖల అధికారులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి తగిన చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఏలూరు జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి జూనియర్ కాలేజీకి వెళ్లే రోడ్డులో డ్రెయినేజీ దుస్థితి



జాగుడిగూడెంలో జననివాసాల మధ్య, అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని చెత్తాచెదారం



స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డులో మెడికల్ వ్యర్థాలు

అధికారులు పట్టించుకోవడం లేదు



నివాసాల మధ్యలో, అంగన్‌వాడీ కేంద్రానికి అనుకుని చెత్తా, చెదారం, మిగిలిన ఆహార పదార్థాలు వేయటంతో అవి కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దీనితో స్థానిక నివాసులు, అంగన్‌వాడీ పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఈ చెత్తను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నపించినా పట్టించుకోవడం లేదు.

– కాలి కుమారి, స్థానికురాలు, జాగుడి గూడెం

డ్రెయినేజీలను మెరుగుపరచాలి



గ్రామంలో ఎక్కడ చూసినా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు, మురుగునీరు నిలిచిపోయి, దోమల పెరిగి దుర్వాసన వ్యాపిస్తోంది. దీని వల్ల డెంగీ వంటి అనేక ప్రమాదకర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గ్రామాల్లో డ్రెయినేజీలోని పూడికను తీసివేసి బ్లీచింగ్ చల్లి డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి.

– మున్నంగి శ్రీనివాసరావు, స్థానికుడు, కొత్తూరు

వైభవంగా ముక్కోటి ఉత్సవాలు



బొర్రంపాలెం ముక్కోటి రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: బొర్రంపాలెం ముక్కోటి రామాలయంలో 67వ ముక్కోటి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం కావడంతో నెలంతా గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గోదాదేవికి సోమవారం సామూహిక సారె పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు వారి ఇళ్ల నుంచి పిండి వంటలు, వస్త్రాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు సోమవారం ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కొనకళ్ల అప్పన్న మాట్లాడుతూ ఈ నెల 10న అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న ప్రసాద వితరణ, భోగి పండుగ రోజు రాత్రి గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉల్లి ధర తగ్గేదెన్నడో?



కన్నాపురంలో డైలీ మార్కెట్లో దిగుమతి అయిన ఉల్లి

కొయ్యలగూడెం: ఉల్లి ధర స్థిరంగా ఉండడంతో ధర ఎప్పుడు దిగి వస్తుందోనని వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. గతంలో సంక్రాంతి సీజన్ వచ్చేసరికి రూ. 20 నుంచి రూ.30 మధ్య ఉల్లి ధర వినియోగదారులకు అందుబాటులో ఉండేవి. కొద్దిరోజుల క్రితం వరకు రూ.50 వరకు వెళ్లిన కేజీ ఉల్లి ధర నాలుగు వారాల నుంచి రూ.35 నుంచి రూ.45 మధ్య చేరింది. గత సీజన్లలో పోల్చితే ధర కేజీ రూ.10 నుంచి రూ.15 ఎక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్, అహమ్మద్ నగర్ నుంచి మాత్రమే ఉల్లి దిగుమతి కొనసాగుతోందన్నారు. గత సీజన్లో కర్నూలు ఉల్లి ఆశించినంత మేర మార్కెట్‌కి రాకపోవడంతో మహారాష్ట్రలో పండిస్తున్న ఉల్లిపైనే ఎక్కువగా వ్యాపారులు ఆధారపడి క్రయవిక్రయాలు సాగిస్తున్నారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వీక్లీ మార్కెట్‌కి తాడేపల్లిగూడెంలో సుమారు 200 లారీలకు పైగా ఉల్లి లోడులు దిగుమతి అవుతుండేవని హోల్‌సేల్ వ్యాపారులు పేర్కొన్నారు. ఇటీవల ఎగుమతుల ప్రభావం వల్ల తాడేపల్లిగూడెంకి రావాల్సిన ఉల్లి దిగుమతులు తగ్గుముఖం పట్టాయని అదే సమయంలో విదేశాలకు ఎగుమతి అయిన ప్రభావం వల్ల ఉల్లి ధర స్థిరంగా ఉండడానికి కారణమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాల్లో ఉల్లి పంట చేతికి రావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తరువాత ఉల్లి ధర దిగివచ్చే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారి వుప్పులూరి వాసు పేర్కొన్నారు. వ్యాపారులు మాలలు ధరించి ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లడం, వరుస పండుగల కారణంగా వ్యాపారులులు ఇళ్లకే పరిమితమవడంతో దుకాణాలను తక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పోటీ ప్రభావం లేక ఉల్లి ధర ఎక్కువగా ఉండడానికి కారణమని పలువురు అంటున్నారు. ప్రస్తుత సంక్రాంతి సీజన్‌లో వంటకాలకు ఉల్లి అత్యవసరం కావడంతో జేబులు గుల్ల అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

నాణ్యమైన ఉల్లి ధర కేజీ రూ.40



హోల్‌సేల్ మార్కెట్లో నాణ్యమైన ఉల్లి ధర కేజీ రూ.40. డైలీ మార్కెట్లో మరో రెండు రూపాయలు అధికంగా ఉంటుంది. మహారాష్ట్రలోని నాసిక్ పరిసర ప్రాంతాల్లో పండిస్తున్న ఉల్లి అందివచ్చే వరకు ధర ఇదేవిధంగా కొనసాగే అవకాశం ఉంది. నాసిక్ ఉల్లి దిగుమతి కావడానికి ఫిబ్రవరి వరకు సమయం ఉంది.

– వగ్వాల పుల్లారావు, హోల్ సేల్ ఉల్లి వ్యాపారి, జంగారెడ్డిగూడెం

ఉల్లి వినియోగం తగ్గించాం



సంక్రాంతి, క్రిస్మస్, న్యూ ఇయర్ ఇలా వరుస వేడుకల సమయంలో కేజీ ఉల్లి రూ. 20 నుంచి రూ. 25కు లభిస్తుండేవి. దానివల్ల వంటకాల్లో ఉల్లిని ఎక్కువగా వినియోగించేవాళ్లం. ఇప్పుడు ఉల్లి ధర అంతకు రెండింతలు ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తుంది.

– కొత్తపల్లి సుజాత, గృహిణి, సీతంపేట

డ్రెయినేజీ నిర్మాణ పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ కౌన్సిల్ కృషి చేస్తుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం స్థానిక 15వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేస్తున్నామని, ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో 15వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 17వార్డు కౌన్సిలర్ నంబూరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, మున్సిపల్ కమిషనర్ కొమ్మని వెంకటరమణ, ఏఈ రాజేష్, ప్లానింగ్ సెక్రటరీ గంగాధర్, ఇమ్యూనిటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం 15వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీవారి ఆలయంలో వైభవంగా ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు శ్రీవారి వైభవాన్ని చాటుతున్నాయి. నిత్యం ఆలయంలో సుప్రభాత సేవకు బదులు, తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. స్వామివారి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్ర పర్వమైంది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజల అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అశ్వ, గజ సేవలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు చేసి, హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్రం వీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

లింగపాలెం: గ్రామాలు ప్రగతిపథంలో నడవాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు కృషి ముఖ్యమని లింగపాలెం ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అన్నారు. లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా గుర్తించి, చర్చించి పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముందుగా సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. లింగపాలెం నుంచి యడవల్లి రహదారి పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని యడవల్లి సర్పంచ్ కట్టుబోయిన రమేష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ నజీమ్ మాట్లాడుతూ త్వరలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో కె.వాణి మాట్లాడుతూ గతంలో ప్రారంభించిన ఇళ్ల పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, మార్చి తరువాత బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు మట్ట సురేష్, కె.ఝాన్సీ, ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ నజీమ్, ప్రజాప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

పంచాయతీ స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదు

భీమడోలు: గుండుగొలను శివారు ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటి ట్యాంకు వద్ద పంచాయతీ స్థలాన్ని అక్రమిస్తే సహించేది లేదని గ్రామ పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసారు. ఈ స్థలాన్ని కొనుగోలు చేశామని, అందులో సువార్త ప్రార్థనలు నిర్వహిస్తామని కొందరు తెలిపారు. దీనితో పలువురు తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేసారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి అనుమతి లేనిదే మతపరమైన కార్యక్రమాలు నిర్వహించరాదని అన్నారు.

నేటి నుంచి పీసా ఎన్నికలు



దొరమామిడిలో పీసా ఎన్నికల విధి, విధానాలను వివరిస్తున్న కార్యదర్శులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన మండలాల్లోని గ్రామాల్లో పీసా ఎన్నికలు మంగళవారం నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామస్థాయిలో ఏ పని జరగాలన్నా పీసా తీర్మానం తీసుకోవాలి. దీనికి పీసా ఆమోదం అవసరం కావడంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ముంపు మండలాల నుంచి తరలివచ్చిన గిరిజనులకు కూడా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీనితో స్థానిక గిరిజనులు, నిర్వాసిత గిరిజనుల మధ్య పోటీ గట్టిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలకు సంబంధించి సోమవారం కార్యదర్శులు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేశారు. మంగళవారం బుట్టాయగూడెం మండలంలో నిర్వహించనున్న ఎన్నికల షెడ్యూల్‌ను ఎంపీడీఓ కె. జ్యోతి వివరించారు. ఎన్నికల మొదటిరోజు 20 గ్రామాల్లో సభలు నిర్వహించి వీటిలో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకుంటారని ఆమె తెలిపారు. మండలంలోని అలివేరు, లంకపాకల, రేగులపాడు, అంతర్వేదిగూడెం, నాగులగూడెం, గాడిదబోరు, పందిరిమామిడిగూడెం, అచ్చియ్యపాలెం, ఇప్పలపాడు, రేగులకుంట, సీతప్పగూడెం, బుట్టాయగూడెం, దొరమామిడి, చిన్నజీడిపూడి, గుబ్బసమామిడి, కొమరవరం, వీరమద్దిగూడెం, గురుగుమిల్లి, తెల్లంవారిగూడెం, బొడ్డేరు గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయటానికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలకు, సమాజానికి చేరువ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈఓ–2 జి.రాములు అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎంసీ మెంబర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన పరిశీలనాధికారిగా వచ్చారు. విద్యా కమిటీలు ఎంత బలోపేతంగా ఉంటే పాఠశాలలు కూడా అంతే సామర్థ్యంతో పని చేస్తాయని ఆయన సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి మాట్లాడుతూ పాఠశాల అవసరాలు తీర్చడంలో విద్యార్థులకు, నాణ్యమైన విద్య అందించడంలో కమిటీలు గణనీయమైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ పి.అంజలి, సభ్యులు జి.భవాని, మురళి బాబు తదితరులు పాల్గొన్నారు.

మీకోసంలో 10 అర్జీలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ (మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ముందుగా వచ్చిన సమస్యలు ఆమోదయోగ్యమైనవా లేదా, ఏదైనా కోర్టు వివాదాల్లో ఉన్నాయా తదితర విషయాలను పరిశీలించాలన్నారు. పరిష్కారయోగ్యం కాని సమస్యల వివరాలను లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మొత్తం 10 అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు. వీటిలో ఎక్కువగా భూసంబంధిత సమస్యలు వచ్చినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గణిజర్లలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గణిజర్లకు చెందిన మొగలి వెంకన్న వద్ద నుంచి 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి మండలం గణిజర్ల, రాఘవాపురంలో పాత నాటు సారా కేసుల్లో నిందితులైన మొగలి వెంకన్న, ఇస్సుమూడి వెంకటరమణను సెక్షన్ 129 చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: పురుగుమందు సేవించి ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.మోషే తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన లింగాల శ్రీను తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో గొడవపడి కొంతకాలంగా వేరుగా ఉంటున్నాడన్నారు. మూడు నెలలుగా పనికి వెళ్లకుండా ఉండటంతో జీవితంపై విరక్తి చెంది, చనిపోవాలనే ఉద్దేశ్యంతో కలుపుమందు తాగాడన్నారు. చుట్టుపక్కల వారు గమనించి శ్రీనును జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు మృతుడి కుమారుడు లింగాల చరణ్ సతీష్ తెలిపారు. ఆ మేరకు చరణ్‌సతీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ గౌరవానికి భంగం కలిగిస్తూ ఆమెను అవమానిస్తున్న నేరంపై ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఆమె భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తుండటంతో ఆయన డ్యూటీకి వెళ్లిన సమయంలో పిల్లలను తీసుకుని సదరు మహిళ తన సోదరి ఇంటికి వెళ్లి అక్కడ ఉండేది. ఈ క్రమంలో తమిర్శి సురేంద్రతో ఆమెకు పరిచయడం ఏర్పడింది. సదరు పరిచయాన్ని అలుసుగా తీసుకుని మహిళను అసభ్యకరంగా తిడుతూ బహిరంగంగా అవమానిస్తూ వేధిస్తున్నాడని మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సురేంద్ర భార్య కూడా సహకారం అందిస్తోందని, వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

హుండీ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: హుండీ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలోని హుండీని ఈ నెల 5న రాత్రి గుర్తు తెలియని దుండగుడు పగులగొట్టి, అందులోని సొమ్మును అపహరించాడన్నారు. ఈమేరకు ఆలయ చైర్మన్ మారిశెట్టిరాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.